సాక్షి
కామారెడ్డి
సోమవారం । 13 । ఫిబ్రవరి । 2023



అధ్వానంగా రోడ్డు

మాచారెడ్డి మండలం మీదుగా వెళ్లే అంతర్ జిల్లా రహదారి అధ్వానంగా మారింది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో ▸



నిరుపయోగంగా..

పలు గ్రామాలలో డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. సేంద్రియ ఎరువులు తయారు చేయడం లేదు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
36.9 /11.0

వాతావరణం

పొగమంచు కురుస్తుంది. చలి గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సమీకృత మార్కెట్ల నిర్మాణం అద్భుతం



ఆర్మూర్: తెలంగాణలోని ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వం సమీకృత మార్కెట్ల నిర్మాణాన్ని చేపట్టడం అద్భుతమైన విషయ మని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సమీకృత వ్యవసాయ మార్కెట్లు ఎన్ని నిర్మించారు? నూతనంగా మార్కెట్లు నిర్మించడానికి ప్రతిపాదనలు ఏమైనా చేశారా ? అని అడగడంతో పాటు రైతు ప్రాంతమైన ఆర్మూర్ నియోజకవర్గానికి సమీకృత మార్కెట్ కావాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకు సీఎం కేసీఆర్ స్వయంగా సమాధానం చెబుతూ ప్రతి రెండు లక్షల మందికి ఒక సమీకృత మార్కెట్ ఏర్పాటు చేయడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అలాగే మార్కెట్‌లో చిన్నపిల్లల కోసం ఆటవిడుపు కేంద్రాలను సైతం ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సమీకృత వ్యవసాయ మార్కెట్ల నిర్మాణానికి రూపకల్పన చేసిన సీఎం కేసీఆర్‌కు ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

బంగారు తెలంగాణ బీజేపీతోనే సాధ్యం



సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రజలు కలలుగన్న బంగారు తెలంగాణ బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఎల్లమ్మగుట్టలో నిర్వహించిన ప్రజా గోస- బీజేపీ భరోసా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు రూ. 3,016 నిరుద్యోగ భృతి అమలుకు నోచుకోవడం లేదని, ఉద్యోగాలు ఇవ్వాలని కోరితే గొర్రెలు, బర్రెలు అంటూ వారి భవిష్యత్‌ను సీఎం కేసీఆర్ నాశనం చేశారని విమర్శించారు. మోదీ ప్రజలపై భారాలు తగ్గిస్తే.. సీఎం మాత్రం బస్సు, విద్యుత్, ప్లాట్ల రిజిస్ట్రేషన్, పెట్రోల్, డీజిల్ భారాలు మోపుతున్నారని ఆరోపించారు. 8 ఏళ్లల్లో ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని, సుమారు 200 దేశాలకుపైగా కరోనా వ్యాక్సిన్‌ను సరఫరా చేసిన ఘనత నరేంద్ర మోదీదని గుర్తు చేశారు. గ్యాస్‌సిలిండర్లు, పంటలకు మద్దతు ధర, మరుగుదొడ్లు, రోడ్లు, ఎల్ఈడీ లైట్లు, వైకుంఠధామాలు ఇస్తున్నారని, రాష్ట్రంలో రాబోయేది డబుల్ ఇంజన్ సర్కారే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్నర్ మీటింగ్ శక్తి కేంద్రం ఇన్‌చార్జి న్యాలం రాజు, నాయకులు పాల్గొన్నారు.

ఏఐయూడబ్ల్యూసీ నేషనల్ కోఆర్డినేటర్‌గా 'కెప్టెన్'



బోధన్: బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నేత కెప్టెన్ కరుణాకర్ రెడ్డి ఆల్ ఇండియా అన్ ఆర్గనైజ్డ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ కాంగ్రెస్(ఏఐయూడబ్ల్యూసీ) నేషన ల్ కో-ఆర్డినేటర్‌గా, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జిగా నియమాకమయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ ఉదిత్‌రాజ్ నియమాక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని ఆదివారం కెప్టెన్ కరుణాకర్ రెడ్డి తెలిపారు. తాను వివిధ విభాగాల అసంఘటిత రంగాల కార్మికులు, పేద ప్రజలు అందిస్తున్న స్వచ్ఛంద సేవలను గుర్తించి తెలంగాణ నుంచి ఏఐయూడబ్ల్యూసీ జాతీయ కో-ఆర్డినేటర్‌గా నియమించారని పేర్కొన్నారు.

మొదటి రోజు 43 దరఖాస్తులు

నిజామాబాద్‌అర్బన్: బదిలీలకోసం 317 జీవో బాధిత టీచర్ల దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి రోజు ఆదివారం 43 మంది దరఖాస్తు చేసుకున్నారు. 317 జీవో కింద బదిలీ అయిన టీచర్లకు పాత సర్వీస్ ప్రకారం పాయింట్లు కేటాయించాలని నూతన ఉత్తర్వులు రావడంతో ఈ బదిలీలు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ ఆదివారం ఆన్‌లైన్‌లో ప్రారంభమైంది. మంగళవారం వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

లక్ష్యం నెరవేరేనా?

ఆర్థిక సంవత్సరం ముగింపు సమీపిస్తుండడంతో పంచాయతీ అధికారులు ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి సారించారు. వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవడానికి కసరత్తు చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ పన్నులు వసూలు చేస్తున్నారు.



- ఇంటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి
- ఇప్పటివరకు 60 శాతం వసూలు..
- మార్చి 31లోగా లక్ష్యాన్ని చేరుకుంటామంటున్న అధికారులు

కామారెడ్డి క్రైం: జిల్లాలో 526 గ్రామ పంచాయతీలున్నాయి. ఆస్తి పన్ను ద్వారా పంచాయతీలకు ఏటా రూ. 10 కోట్లపైనే ఆదాయం సమకూరుతోంది. 2017-18 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.11.47 కోట్ల పన్నులు చేయాలన్నది లక్ష్యం కాగా.. రూ. 10.87 కోట్లు వసూలు చేశారు. 2018-2019 నాటికి ఇంటి పన్నుల వసూళ్ల లక్ష్యం రూ. 9 కోట్లకు తగ్గింది. జిల్లాలో బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలు కొత్తగా ఏర్పడడంతోపాటు కామారెడ్డి మున్సిపాలిటీలో పలు పంచాయతీలు విలీనమవడమే ఇందుకు కారణం. కామారెడ్డి బల్దియాలో 7 పంచాయతీలు విలీనం కాగా ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో గండిమాసానిపేట, దేవునిపల్లి, లింగారెడ్డిపేట జీపీలు కలిశాయి. బాన్సువాడ బల్దియాగా మారింది. దీంతో పంచాయతీల పన్ను వసూళ్ల లక్ష్యం తగ్గింది. మూడేళ్లుగా వందశాతం పన్నులు వసూలు చేస్తున్నారు. ఈసారి పన్ను వసూలు లక్ష్యం రూ. 9.91 కోట్లు కాగా.. ఇప్పటివరకు రూ. 5.72 కోట్లు వసూలయ్యాయి. ఇంకా రూ. 4.19 కోట్ల పన్నులు వసూలు చేయాల్సి ఉంది.

ప్రత్యేక బృందాల ఏర్పాటు..

ఈ ఆర్థిక సంవత్సరం పూర్తి కావస్తుండడంతో ఇంటి పన్నుల వసూళ్లపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. మార్చి నెలాఖరు వరకల్లా లక్ష్యం మేరకు పన్నులను వసూలు చేయడం కోసం ఇటీవలే మండల, పంచాయతీ స్థాయి అధికారులకు అవగాహన కల్పించారు. కలెక్టరేట్‌లో డివిజన్‌లవారీగా ఎంపీవోలు, జీపీ కార్యదర్శులకు సమావేశాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. జీపీలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలతోపాటు పన్నుల వసూళ్లపై కూడా సమావేశాల్లో చర్చించారు. ఎంపీవోల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకుని వంద శాతం లక్ష్యం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే జీపీల పరిధిలో కార్యదర్శులు, సిబ్బంది ఇంటింటికి తిరుగుతున్నారు. లక్ష్యం మేరకు ఈసారి కూడా వంద శాతం సాధిస్తామని అధికారులు చెబుతున్నారు.

ప్రజలు సహకరించాలి



మార్చి 31 నాటికి జిల్లాలో వంద శాతం పన్నులు వసూలు చేయడమే లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళ్తున్నాం. పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలకు ఇప్పటికే పన్నుల వసూళ్లపై అవగాహన కల్పించాం. సకాలంలో లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించాం. ప్రజలు కూడా ఇంటి పన్నులు చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలి.

\- శ్రీనివాస్‌రావు, డీపీవో, కామారెడ్డి

'అప్పుల ఊబిలో తెలంగాణ'



బీజేపీ పతాకావిష్కరణలో పాల్గొన్న పార్టీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి, నేతలు

భిక్కనూరు: సీఎం కేసీఆర్ అనాలోచిత చర్యల వల్ల తెలంగాణ అప్పుల ఊబిలో కూరుకుపోతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం భిక్కనూరు మండలంలో ప్రజాగోస.. బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఒకటో తారీఖున వేతనాలు ఇవ్వలేని దుస్థితిలో ఉందన్నారు. ఇందుకు సీఎం కేసీఆర్ పాలనే కారణమన్నారు. కేంద్రం రాష్ట్రానికి నిధులను పంపిస్తుంటే సీఎం కేసీఆర్ వాటిని వేరే పథకాలకు మళ్లిస్తున్నారని ఆరోపించా రు. కేంద్ర ప్రభుత్వ పథకాలను పేర్లు మార్చి తన పథకాలుగా ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజలు బీజేపీకి బీఆర్ఎస్‌కు తేడాను గుర్తించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రెడ్డిగారి రమేశ్‌రెడ్డి, భిక్కనూరు పట్టణాధ్యక్షుడు నర్సింలు, నేతలు అలకొండ శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేందర్, ఏక్‌నాథ్, గణేశ్‌రెడ్డి, బాల్‌లింగం, బస్వారెడ్డి, భూపాల్‌రెడ్డి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

15నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- జిల్లాలో 80 సెంటర్ల ఏర్పాటు
- నాన్ జంబ్లింగ్ విధానంలోనే పరీక్షలు

కామారెడ్డి టౌన్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 15వ తేదీనుంచి ప్రారంభం కానున్నాయి. ఇందు కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ఎంపీసీలో 2,425 మంది, బైపీసీలో 2,798 మంది, వొకేషనల్‌లో 2,552 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కానున్నారు. వీరికోసం 80 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు గతంలో మాదిరిగానే నాన్ జంబ్లింగ్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు.

మూడు విడతల్లో..

ప్రాక్టికల్ పరీక్షలు మూడు విడతల్లో నిర్వహించనున్నారు. ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు మొదటి విడత పరీక్షలు ఉంటాయి. 21 నుంచి 25 వరకు రెండో విడత, 26 నుంచి మార్చి 2వ తేదీవరకు మూడో విడత ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతి రోజు రెండు పూటలా పరీక్ష ఉంటుంది. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటలకు పరీక్షలు నిర్వహిస్తారు.

విద్యార్థులందరికీ హాల్ టికెట్లు

ప్రతీ పరీక్ష కేంద్రం, కళాశాల వారీగా హాల్ టికెట్లను కళాశాల లాగిన్‌లో అందుబాటులో ఉంచారు. ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలల్లోని ప్రతి విద్యార్థికి హాల్ టికెట్లు అందజేయాలని ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం ఆదేశించారు. ఏ కారణంతోనైనా ప్రైవేటు యాజమాన్యాలు హాల్‌టికెట్ ఇవ్వడానికి నిరాకరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒకవేళ హాల్‌టికెట్‌పై విద్యార్థి వివరాలు, సబ్జెక్టులు, తేదీ సమయంలో ఏమైనా పొరపాట్లు ఉంటే వెంటనే వాటిని అధికారులకు తెలియజేయాలని సూచించారు.

యోగాకు పెద్దపీట



నిజాంసాగర్ మండలంలో నిర్మాణం పూర్తయిన యోగా కేంద్రం



బీబీపేటలో నిర్మాణంలో ఉన్న యోగా కేంద్రం

- ఆస్పత్రుల్లో యోగా కేంద్రాల ఏర్పాటు
- ఒక్కో కేంద్రానికి రూ. 6 లక్షల వరకు నిధులు మంజూరు
- వేగంగా సాగుతున్న పనులు

నిజాంసాగర్/బీబీపేట: పట్టణ ప్రాంతాలలోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ యోగా కేంద్రాలు నిర్మించేందుకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయి. నేషనల్ ఆయూష్ మిషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో యోగా కేంద్రాలు నిర్మిస్తున్నారు. జిల్లాకు 16 కేంద్రాలను మంజూరు చేశారు. గాంధారి, పుల్కల్, ఆర్గొండ, చిల్లర్గి, దోమకొండ, నాగిరెడ్డిపేట, కామారెడ్డి, ఎల్లారెడ్డి, లింగంపేట, జుక్కల్, నిజాంసాగర్, భిక్కనూరు, మద్నూర్, బీబీపేట, ఎల్లంపేట, బాన్సువాడలలో కేంద్రాల భవనాలు నిర్మించనున్నారు. ఒక్కో కేంద్రం నిర్మాణానికి రూ. 4 లక్షల రూ. 6 లక్షల వరకు మంజూరు చేశారు. నేషనల్ ఆయూష్ మిషన్ నిబంధనల ప్రకారం గాలి, వెలుతురు సోకే విధంగా 18 ఫీట్ల వెడల్పు, 21 ఫీట్ల పొడవుతో భవనాలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తికావచ్చాయి. మిగతా చోట్ల పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రతి కేంద్రానికి ఇద్దరు యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించనున్నారు.

యోగాపై ప్రత్యేక దృష్టి..

రోజూ యోగా చేయడం వల్ల దీర్ఘకాలిక రోగాలకు చెక్ పెట్టవచ్చు. ప్రభుత్వం జిల్లాకు 16 యోగా కేంద్రాలను మంజూరు చేసింది. త్వరలోనే ప్రజలకు యోగా కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి.

\- వెంకటేశ్వర్లు, ఆయూష్ జిల్లా ఇన్‌చార్జి

'ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి'

కామారెడ్డి క్రైం: ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లాకేంద్రంలో ర్యాలీ తీశారు. బస్టాండ్ సమీపంలో ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. సీఎస్ఐ చర్చి నుంచి ఇందిరాగాంధీ స్టేడియం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 నుంచి 17 వరకు అన్ని బ్యాంకులలో ఆర్థిక అక్షరాస్యతపై పోస్టర్ల ప్రదర్శన, అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. సైబర్ మోసాలకు గురి కాకుండా బ్యాంక్ సేవలు నిర్వహించుకునే పద్ధతులను బ్యాంకుల అధికారులు వివరించాలన్నారు. సైబర్ నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీస్ కళాజాతల ద్వారా వివరిస్తామని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అనంతరం స్టేడియం ఆవరణలో పోలీస్ కళాజాత నిర్వహించారు. సైబర్ మోసం జరిగే తీరును నాటిక ద్వారా వివరించారు. ర్యాలీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, కెనరా బ్యాంక్ రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావు, ఎల్‌డీఎం చైర్మన్ చిందం రమేష్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, మైనారిటీ కళాశాల ప్రిన్సిపల్ ఇంతియాజ్ అలీ, ఆర్కే కళాశాల విద్యార్థులు, సిబ్బంది, లింగంపేట బీసీ మహిళా గురుకుల పాఠశాల విద్యార్థినులు, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు, పోలీసులు, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ ధోత్రే, అధికారులు

'కార్మికులు ఐకమత్యంతో ఉండాలి'



మాట్లాడుతున్న ముజీబొద్దీన్

కామారెడ్డి టౌన్: బైక్ మెకానిక్‌లు, కార్మికులంతా ఐకమత్యంతో ఉండాలని ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్ సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో టూ వీలర్ మెకానిక్స్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెకానిక్‌ల సమస్యలను, డిమాండ్‌లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా మెకానిక్‌లు అందరూ ఏకతాటిపైకి రావాలని రాష్ట్ర టూ వీలర్ మెకానిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి సూచించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో మెకానిక్‌ల కోసం ప్రభుత్వం 300 గజాల స్థలాన్ని ఇచ్చిందన్నారు. సిద్దిపేటలో మెకానిక్‌ల కోసం యూనియన్ ఆధ్వర్యంలో ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపట్టామన్నారు. మెకానిక్‌లందరూ గుర్తింపు కార్డులు తీసుకోవాలన్నారు. కార్డు ఉంటే ఇన్సూరెన్స్ వర్తిస్తుందని పేర్కొన్నారు. త్వరలో హైదరాబాద్‌లో మెకానిక్‌ల భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నిట్టు వేణుగోపాల్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు ఐరేని సందీప్ కుమార్, కామారెడ్డి బైక్ మెకానిక్స్ అసోసియేషన్ సభ్యులు కిరణ్, నాగరాజు, రాజు, శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్‌ను ప్రోత్సహిస్తున్నాం

- డ్వాక్రా మహిళలకు సబ్సిడీపై సోలార్ ప్లాంట్లు..
- చేపల పెంపకానికీ చేయూతనిస్తున్నాం
- పోడు పట్టాలపై కసరత్తు జరుగుతోంది
- 'సాక్షి'తో కలెక్టర్ జితేష్ వి పాటిల్



సాక్షి, కామారెడ్డి: ''విద్యుత్ వాడకం పెరిగింది. దీంతో బిల్లులు ఎక్కువగా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వినియోగదారులపై భారం తగ్గించడానికి సౌర విద్యుత్‌ను ప్రోత్సహిస్తున్నాం. సోలార్ ప్లాంట్‌ల ఏర్పాటు కోసం మహిళా సంఘాలకు రుణాలు ఇస్తాం. అలాగే మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు చేపల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నాం. మన ఊరు - మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి'' అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. పలు అంశాలపై ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

చాలా కుటుంబాల్లో రెండు వందల యూనిట్లకుపైగా విద్యుత్ వాడుకుంటున్నారు. దీంతో వారికి రూ. వెయ్యికిపైగా బిల్లు వస్తోంది. ఎండాకాలంలో వినియోగం మరింత పెరిగి కరెంటు చార్జీలు ఎక్కువగా వచ్చే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా సౌర విద్యుత్‌పై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ ఖర్చు తగ్గిపోవడంతో పాటు మిగులు విద్యుత్‌ను అమ్ముకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ విషయంలో స్వయం సహాయక సంఘాలకు అవగాహన కల్పిస్తున్నాం. దీనికి జిల్లాలో ఇప్పటికే 609 మంది సమ్మతి తెలిపారు. నస్రుల్లాబాద్ మండలం అంకోల్ క్యాంప్‌లో పదిహేను కుటుంబాలు సోలార్ యూనిట్లు అమర్చుకున్నాయి. లింగంపేట మండలం మోతె గ్రామంలోనూ పలువురు యూనిట్లు ఏర్పాటు చేసుకున్నారు. కామారెడ్డి పట్టణంలోనూ కొందరు సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకుని విద్యుత్ చార్జీల భారం తగ్గించుకున్నారు.

సబ్సిడీతోపాటు రుణం..

మహిళా సంఘాల సభ్యులకు రెడ్‌కో ద్వారా సోలార్ యూనిట్లు మంజూరు చేస్తున్నాం. రెండు కిలోవాట్ల సిస్టమ్‌కు రూ. లక్షా 42 వేలు ఖర్చవుతాయి. ఇందులో రెడ్కో రూ.39 వేలు సబ్సిడీగా ఇస్తుంది. బ్యాంకు నుంచి రూ.లక్ష రుణం ఇప్పిస్తారు. లబ్ధిదారు ఒక్కో యూనిట్‌కు రూ. 3 వేల వాటా ధనంగా చెల్లిస్తే సరిపోతుంది. యూనిట్ నెలకొల్పిన తర్వాత నెలకు ఈఎంఐగా రూ. 2,243 చెల్లించాల్సి ఉంటుంది. ఇలా నాలుగేళ్లు చెల్లిస్తే రుణం తీరుతుంది.

మూడు కిలోవాట్ల కెపాసిటీ ఉన్న యూనిట్ విలువ రూ. లక్షా 92 వేలు. సభ్యురాలు రూ.10 వేల వాటాధనం చెల్లిస్తే.. రెడ్‌కో ద్వారా రూ.57 వేలు సబ్సిడీ వస్తుంది. బ్యాంకు ద్వారా రూ.లక్షా 25 వేలు రుణం మంజూరవుతుంది. నెలనెలా రూ. 2,803 రుణ వాయిదా చెల్లించాల్సి ఉంటుంది.

పూర్తి పరిశీలన తర్వాతే..

జిల్లాలో పోడు పట్టాల కోసం 11,282 మంది గిరిజనులు దరఖాస్తు చేసుకున్నారు. వాటిని అటవీ హక్కుల సమితి పరిశీలించింది. సబ్ డివిజనల్ కమిటీ వాటిని పరిశీలించి, అర్హత ఉన్నవారి జాబితాను రూపొందిస్తుంది. పూర్తి పరిశీలన తర్వాత పోడు పట్టాలు అందిస్తాం.

చేపల యూనిట్లు..

జిల్లాలో కొర్రమీను చేపలు ఎక్కువగా తింటారు. వాటిని పెంచేందుకు అనుకూల వాతావరణమూ ఉంది. రెండు మూడు ఎకరాల్లో పంట ద్వారా వచ్చే ఆదాయంకన్నా రెండు మూడు గుంటల్లో చేపల పెంపకంతో ఎక్కువ ఆదాయం వస్తుంది. తక్కువ సమయంలోనే ఎక్కువ ఆదాయం సంపాదించుకోవచ్చు. స్వయం సహాయక సంఘాల మహిళల సభ్యులకు దీనిపై అవగాహన కల్పించి యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. సదాశివనగర్ మండలం భూంపల్లి, మోడెగాం గ్రామాల్లో యూనిట్లను ఏర్పాటు చేశాం. ఉపాధి హామీ పథకం ద్వారా ఫాం పాండ్స్ తవ్వుకునేందుకు అవకాశం కల్పిస్తాం.

వేగంగా మన ఊరు -మన బడి

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేందుకు ప్రభుత్వం మన ఊరు-మన బడి కార్యక్రమాన్ని తీసుకువచ్చింది. దీనిలో భాగంగా జిల్లాలో 44 పాఠశాలలను ఎంపిక చేసి వాటిని అభివృద్ధి చేస్తున్నాం. ఇప్పటికే దేవునిపల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, పుల్కల్, బొల్లారం తండా పాఠశాలలను ఆధునికీకరించి, ప్రారంభించాం. ఇబ్రహీంపేటలో పనులు పూర్తి కావచ్చాయి. మిగతా స్కూళ్లలో పనులు వేగంగా నడుస్తున్నాయి. నెలాఖరులోగా పనులు పూర్తి చేస్తాం.

జాతీయస్థాయి తైక్వాండోలో బస్వాకు కాంస్యం



కాంస్య పతకంతో బస్వాలక్ష్మీనర్సయ్య

నిజామాబాద్‌నాగారం: జాతీయ స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో బీజేపీ జిల్లా అధ్యక్షులు బస్వాలక్ష్మీ నర్సయ్య కాంస్య పతకం సాధించారు. ఈ నెల 12న పాండిచ్చేరిలో జరిగిన జాతీయస్థాయి తైక్వాండోచాంపియన్‌షిప్ పోటీల్లో ఆయన పాల్గొన్నారు. 65 సంవత్సరాలపైబడి కేటగిరిలో ఈ పోటీలు జరిగాయి. దేశంలోని 29 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు వచ్చారు. ఈ విభాగంలో మొదటిసారిగా బస్వాలక్ష్మీనర్సయ్య కాంస్య పతకం సాధించారు. ఈ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్‌వీఎస్ సుభాష్, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు సతీష్‌గౌడ్‌లు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కోచ్ మనోజ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాలువలో కొట్టుకుపోయిన మహిళ.. కాపాడిన కారోబార్



కారోబార్‌ను అభినందిస్తున్న రైతులు

రుద్రూర్: మండలంలోని చిక్కడపల్లి శివారులో గల నిజాంసాగర్ కాలువలో కొట్టుకుపోతున్న మహిళను గ్రామ పంచాయతీ కారోబార్ మచ్కురి అశోక్ కాపాడాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా. అదివారం పొలానికి వెళుతున్న అశోక్‌కు కాలువలో కొట్టుకుపోతున్న మహిళ కనిపించింది. వెంటనే అతడు కాలువలోకి దూకి మహిళను గట్టుకు చేర్చాడు. బాధితురాలు సులేమాన్‌నగర్‌కు చెందిన జ్యోతిగా గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మహిళను కాపాడిన అశోక్‌ను స్థానికులు అభినందించారు.

చెట్టు కూలడంతో రాకపోకలకు అంతరాయం



తాడ్వాయి: మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామ శివారు కామారెడ్డి, ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో ఆదివారం మర్రి చెట్టు కూలి రోడ్డుకు అడ్డంగా పడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ స్తంభించడంతో కానిస్టేబుళ్లు రవి, సుదర్శన్, గంగారాం, స్థానికులు కలిసి గంటకు పైగా శ్రమించి రోడ్డుకు అడ్డంగా పడ్డ చెట్టును తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



పిట్లం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే అరుణ తార పేర్కొన్నారు. ప్రజా గోస-భాజపా భరోసా కార్యక్రమంలో భాగంగా ఆమె మండలంలోని గొద్మేగాం గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి ఇంటింట తిరిగి కేంద్రం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. యువత బీజేపీ వైపు ముగ్గు చూపుతున్నారని, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ పార్టీ అధికారంలో రావడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్ పంతులు, మండల అధ్యక్షుడు అభినయ్ రెడ్డి, నాయకులు ఆగంరెడ్డి, మోహన్ రెడ్డి, అశోక్ రాజ్, సాయి రెడ్డి, నాగిరెడ్డి, సద్దాం, సూర్యకాంత్, శ్రీహరి, వెంకట్ తదితరలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



పిట్లం: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని హెడ్ కానిస్టేబుల్ సాయాగౌడ్ పేర్కొన్నారు. ఆయన సిబ్బందితో కలిసి ఆదివారం మండలంలోని చిల్లర్గి గేట్ వద్ద పిట్లం, బాన్సువాడ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది మహేందర్, మొయిన్, కాశగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై దయ లేదా?

- నెలల తరబడి విడుదలకాని స్టైఫండ్
- ట్రావెలింగ్, ఎస్కార్ట్ అలవెన్సు సైతం పెండింగ్‌లోనే..
- పట్టించుకోని అధికారులు



బాన్సువాడలో విరిగిన ఆటవస్తువులతోనే ఆడుకుంటున్న దివ్యాంగ చిన్నారులు (ఫైల్)



బాన్సువాడలో ఫిజియోథెరపీ శిబిరానికి హాజరైన దివ్యాంగులు (ఫైల్)

బాన్సువాడ రూరల్: శారీరక, మానసిక దివ్యాంగులకు సకాలంలో ప్రభుత్వ సాయం అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భవిత కేంద్రాలకు ఫిజియో థెరపీ వైద్యం, విద్య కోసం వచ్చే ప్రత్యేక అవసరాలు కల వారికి ప్రభుత్వం స్టైఫండ్‌తో పాటు రవాణా భత్యం చెల్లిస్తుంది. అలాగే ఎస్కార్ట్(సహాయకుడు) సహాయంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ప్రభుత్వం ప్రతినెలా ఎస్కార్ట్ అలవెన్సు చెల్లించాలి. ప్రతినెలా క్రమం తప్పకుండా చెల్లించాల్సిన అలవెన్సులను ప్రభుత్వం నెలల తరబడి చెల్లించకపోవడంతో దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు.

విద్యాహక్కు చట్టం అమలులో భాగంగా..

2009 విద్యాహక్కు చట్టం ప్రకారం 6నుంచి 14ఏళ్ల లోపు బాలబాలికలందరూ ఉచిత నిర్బంధ విద్య పొందాలి. ప్రత్యేక అవసరాలు కల్గిన దివ్యాంగ విద్యార్థులు కూడా దానికి మినహాయింపు కాదు. అందుకే అప్పటి ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థుల కోసం 2012-13లో భవిత కేంద్రాలను నెలకొల్పి శాశ్వత భవనాలు నెలకొల్పి, ప్రత్యేక విద్యకు అవసరమైన పరికరాలు సమకూర్చి సిబ్బందిని నియమించారు. ప్రస్తుతం ఆటపాటలతో కూడిన విద్య అందించడానికి సరఫరా చేసిన వివిధ రకాల ఆటవస్తువులు, పరికరాలు, వ్యాయామ వస్తువులు శిథిలావస్థకు చేరాయి. కొత్త ప్లేయింగ్, లర్నింగ్ మెటీరియల్‌ను అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జిల్లాలో 17 భవిత కేంద్రాలు..

కామారెడ్డి జిల్లాలోని వివిధ మండలాల్లో 17 భవిత కేంద్రాలు ఉన్నాయి. సుమారు 2102 మంది దివ్యాంగులు జిల్లాలో నమోదై ఉన్నారు. భవిత కేంద్రాలకు ఫిజియో థెరపీ, ప్రత్యేక విద్య కోసం వచ్చే విద్యార్థులు 276మంది ఉన్నారు. వీరంతా జన్యులోపాలతో పాటు పోలియో, పక్షవాతం, వినికిడిలోపం, ఎముకల బలహీనత, బుద్ధిమాంద్యం, బహుళవైకల్యం వంటి 21రకాల రుగ్మతలతో బాధపడుతున్నారు. అలాగే ఎస్కార్టు సహాయంతో వివిధ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు 349మంది ఉన్నారు. వీరికి ప్రతినెలా రూ.350చొప్పున రవాణా భత్యం, ఎస్కార్టు అలవెన్సులు చెల్లించాల్సి ఉంటుంది. వీరితో పాటు స్టయిఫండ్ పొందడానికి అర్హులైన బాలికలు 430మంది ఉండగా వీరికి నెలకు రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. కానీ మరో రెండు నెలల్లో విద్యా సంవత్సరమే పూర్తి కావస్తున్నా నేటికి ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు.

తల్లి/తండ్రికి పింఛన్ మంజూరు చేయాలి

తీవ్రమైన శారీరక, మానసిక వైకల్యం కల్గిన చిన్నారుల బాగోగులు చూసుకుంటూ వారి వైద్యం, మందులకు డబ్బులు వెచ్చించే తల్లిదండ్రుల్లో ఒకరికి ప్రభుత్వం ఎస్కార్ట్ పింఛన్ మంజూరు చేయాలని కోరుతున్నారు. అలాగే తీవ్రమైన వైకల్యం గల చిన్నారులకు న్యూట్రిషన్ కిట్‌లు సరఫరా చేయాలని, పెండింగ్ అలవెన్సులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఖర్చులు పెరిగిపోయాయి..

ప్రస్తుతం ఆటో, బస్సు చార్జీలు పెరిగిపోయా యి. ఖర్చులు పెరిగిపోవడంతో మా బిడ్డను భవిత కేంద్రానికి క్రమం తప్పకుండా తీసుకుని రాలేకపోతున్నాం. ఎంతోమందికి ప్రభుత్వం పింఛన్లను ఇస్తుంది. తీవ్ర వైకల్యం ఉన్న వారిని పోషిస్తున్న తల్లిదండ్రుల్లో ఒకరికి పింఛన్ మంజూరు చేయాలి.


–గంగామణి, తల్లి, బాన్సువాడ


విడుదల కాగానే జమచేస్తాం..

దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషిచేస్తోంది. గత 5నెలలుగా ట్రావెలింగ్, ఎ స్కార్ట్ అలవెన్సులతో పాటు స్టయిఫండ్ పెండింగ్‌లో ఉంది. అర్హులైన వారందరి వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చే శాం. నిధులు విడుదల కాగానే వారి అకౌంట్లో జమ చేస్తాం.

– శ్రీపతి, సెక్టోరియల్ ఆఫీసర్, కామారెడ్డి.

అధ్వానంగా అంతర్‌జిల్లా రోడ్డు





మాచారెడ్డి-గంభీరావుపేట రోడ్డుపై ఏర్పడిన గుంతలు

- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

మాచారెడ్డి: మండలంలోని అంతర్ జిల్లా రహదారి అధ్వానంగా మారింది. అడుగులోతు గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టకపోవడంతో అధికారుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నరకప్రాయంగా ప్రయాణం..

మాచారెడ్డి మండల కేంద్రం నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రానికి వెళ్లే రహదారి ఘన్‌పూర్ (ఎం), చెరువుకొమ్ము తండాల పరిధిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. సిద్దిపేట, ముస్తాబాద్, గంభీరావుపేట మీదుగా కామారెడ్డికి బస్సులు ఇదే రోడ్డుగుండా తిరుగుతాయి. రెండు జిల్లాల సరిహద్దు కావడంతో అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ఆ రోడ్డు మీదుగా వెళితే వెన్ను సమస్యలు తలెత్తి ఆస్పత్రుల పాలవుతున్నారు. అలాగే అడుగుకో గుంతలతో వాహనం అదుపుతప్పి కింద పడిపోయి గాయాలపాలవుతున్న సంఘటనలు కోకొల్లలు. ఇటీవల గజ్యానాయక్ తండాకు చెందిన రాము అనే యువకుడు గంబీరావుపేట వెళ్లి వస్తుండగా గుంతలో పడి ఆస్పత్రిపాలయ్యాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంతర్ జిల్లా రోడ్డుకు మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

మరమ్మతులు చేయించాలి..



అధ్వానంగా మారిన గంభీరావుపేట రోడ్డు మీద వెళితే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎటూ వెళ్లాలన్నా గుంతలతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయించాలి. లేనిపక్షంలో ఈ రోడ్డుపై ఆర్టీసీ బస్సులను తిరగనీయం.

–విజయ్, చెరువుకొమ్ముతండా

ఆస్పత్రిపాలయ్యాను..



పది రోజుల కిందట గంభీరావుపేటకు వెళ్లివస్తుండగా రోడ్డుపై గల గుంతలో పడి గాయపడ్డాను. దీంతో మూడు రోజులు ఆస్పత్రిలో ఉండాల్సి వచ్చింది. అదే రోజు నా వెనకాలే వస్తున్న మరో వ్యక్తి కూడా గుంతలో పడి గాయపడ్డాడు. ఇప్పటికైనా అధికారులు రోడ్డును బాగుచేయించాలి.

–రాము, గజ్యానాయక్ తండా

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



1986-87 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని ముదక్‌పల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1986-87లో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 36 ఏళ్ల తర్వాత వారంత కలుసుకోవడంతో ఆనందం వ్యక్తం చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు తమ కుటుంబసభ్యులతో హాజరై ఉత్సాహంగా గడిపారు.

క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం



విజేతలకు బహుమతులను అందజేస్తున్న శ్రీనివాస్ రావు

పెర్కిట్(ఆర్మూర్): క్రీడల ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్, సికింద్రాబాద్ డీసీపీ శ్రీనివాస్ రావు అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో నిర్వహించిన 41వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణిస్తే భవిష్యత్తులో క్రీడా కోటా కింద ఉద్యోగాలు లభిస్తాయన్నారు. బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణా రావు, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఫిబ్రవరి 16 నుంచి 20 వరకు మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో బాలుర విభాగంలో నల్గొండ జట్టు ప్రథమ స్థానం, కరీంనగర్ ద్వితీయ స్థానం, నిజామాబాద్ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో ఖమ్మం జట్టు ప్రథమ స్థానం, మెదక్ ద్వితీయ స్థానం, వరంగల్ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మానస గణేష్, శ్యామ్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ముత్తెన్న పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం జరిగేదెప్పుడు?

- అక్రమాలకు పాల్పడ్డ తొర్తి బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్
- పూర్తిస్థాయి విచారణ జరపని తపాలాశాఖ ఉన్నతాధికారులు
- ఆందోళనకు సిద్ధమవుతున్న బాధితులు



తొర్తి గ్రామ పంచాయతీలో విచారణ జరుపుతున్న అధికారులు (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): అధికారుల నిర్లక్ష్యంతో బాధితులకు న్యాయం సకాలంలో జరగడం లేదు. నెలలు గడుస్తున్నా విచారణ పేరుతో కాలయాపన చేయడంపై సదరు బాధితులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తొర్తి బ్రాంచ్ పోస్టాఫీస్‌లో పలువురు ఖాతాదారులు సుకన్య సమృద్ధి యోజన, ఇతర ప్రభుత్వ పథకాల కోసం డిపాజిట్లు చెల్లించారు. కానీ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ ఖాతాదారుల సొమ్మును తపాలా శాఖలో జమ చేయకుండా తన సొంతానికి వాడుకున్నాడు. 2022 అక్టోబర్‌లో తొర్తి బీపీఎం అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో అప్పట్లో విచారణ పేరుతో హడావిడి చేసిన అధికారులు రోజులు గడచిన కొద్ది నెమ్మదించారని పలువురు విమర్శిస్తున్నారు.

అధికారుల తీరుపై సందేహాలు..

తొర్తి బ్రాంచ్ పోస్టుమాస్టర్‌పై విచారణ పూర్తి చేయడంలో ఉన్నతాధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. పక్కదారి పట్టిన సొమ్మును రికవరీ చేసి బాధితులకు న్యాయం చేయడంలో తపాలా శాఖ చూసిచూడనట్లు ఉండటంపై అనేక సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. సుకన్య సమృద్ధి యోజన, రికరింగ్ డిపాజిట్లకు సంబంధించి దాదాపు రూ.40లక్షలు పక్కదారి పట్టాయని గ్రామస్తులు చెబుతున్నారు. కానీ ఇప్పటివరకు కేవలం రూ.1.20లక్షలను మాత్రమే రికవరీ చేశామని తపాలా శాఖ అధికారులు వెల్లడించడం గమనార్హం. బీపీఎంను సస్పెండ్ చేసినా అతని వద్ద నుంచి సొమ్మును చట్టపరంగా రికవరీ చేయాల్సి ఉంది. దీంతో బీపీఎంతో తపాలాశాఖ అధికారు లు కొందరు కుమ్మక్కైనారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈక్రమంలో తపాల శాఖ అధికారుల తీరు ను నిరసిస్తూ గ్రామస్తులు ఆందోళన కార్యక్రమాల ను నిర్వహించాలని భావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీపీఎం నుంచి సొమ్ము రికవరీ చేయాలని బాధితులు కోరుతున్నారు.

ఎలాంటి స్పందన లేదు..



నా కూతురి భవిష్యత్ కోసం సుకన్య సమృద్ధి ఖాతా తెరిచి డబ్బులు జమ చేశాను. నేను చెల్లించిన సొమ్ముకు తపాల శాఖ రికార్డులకు తేడా ఉండటంతో అక్టోబర్‌లో స్వయంగా ఫిర్యాదు చేశాను. ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదు.

– రవిదాస్, బాధితుడు, తొర్తి

డబ్బులు ఇప్పించలేదు..



బీపీఎం నుంచి మా డబ్బులు వాపసు ఇప్పిస్తామని చెప్పిన అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం చేయలేదు. నా కూతురి కోసం రూ.60వేలు సుకన్య సమృద్ధి యోజన కోసం చెల్లించాను. రికార్డులలో సొమ్ము జమ చేసినట్లు లేదు.

– బొజ్జ సుమ, బాధితురాలు, తొర్తి

నిరసన దీక్షలు చేస్తాం...



తొర్తి బీపీఎం అక్రమాలపై అధికారులు స్పందించడం లేదు. దీనిపై గ్రామంలో నిరసన దీక్షలను చేపడుతాం. అయినా ఎలాంటి స్పందన లేకపోతే తపాల కార్యాలయాలను ముట్టడించి, న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం.

– మాదాం నర్సయ్య, తొర్తి

రేషన్ బియ్యం పట్టివేత



సిరికొండ: మండలంలోని పెద్ద వాల్గోట్ గ్రామంలో అక్రమంగా ఉంచిన రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు ఎస్సై నర్సింలు ఆదివారం తెలిపారు. ఓ వాహనంలో బియ్యాన్ని ఆదివారం తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులను విచారించగా ఒక ఇంట్లో మరిన్ని బియ్యం సంచులు లభించాయని తెలిపారు. పట్టుబడిన మొత్తం బియ్యం 16.58 క్వింటాళ్లు ఉంటాయని తెలిపారు. బియ్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి

–మరొకరికి గాయాలు



సుభాష్ (ఫైల్)

మోపాల్(నిజామాబాద్ రూరల్): మండలంలోని న్యాల్‌కల్ గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి మృతిచెందాడు. గ్రామస్తులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. న్యాల్‌కల్ గ్రామానికి చెందిన సుభాష్(45) ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లగా.. రెండు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. మార్చిలో తిరిగి గల్ఫ్ వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం సుభాష్ తన స్నేహితుడు రాములుతో కలిసి బైక్‌పై నిజామాబాద్ నుంచి న్యాల్‌కల్‌కు వస్తున్నాడు. గ్రామశివారులోని మూలమలుపు వద్ద వీరి బైక్ అదుపు తప్పడంతో వారు కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో సుభాష్‌కు తీవ్ర గాయాలు, రాములుకు స్వల్పగాయాలయ్యాయి. బాధితులను ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించి సుభాష్ మృతిచెందాడు. రాములు చికిత్స పొందుతున్నాడు. 5వ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చెరువులో పడి బాలుడు..

నవీపేట: మండలంలోని మద్దెపల్లి గ్రామ శివారులోని చెరువులో ఓ బాలుడు ప్రమాదవశాత్తు పడి, మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు ఇలా.. మద్దెపల్లి ఉప సర్పంచ్ మంగీలాల్, లలిత దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న మంగీలాల్ పెద్ద కుమారుడు మూడు రమణ(12) ఆదివారం తన స్నేహితులతో కలిసి చెరువు సమీపంలో ఆడుకున్నాడు. ఈక్రమంలో చెరువులో ఈతకు దిగిన రమణ ఈత రాకపోవడంతో మునిగిపోయి, మృతి చెందాడు. ఈవిషయమై పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో ఆటోను ఓ లారీ ఢీకొనగా.. ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. నాగిరెడ్డిపేట మండలంలోని జప్తిజాన్కంపల్లి నుంచి ప్రయాణికులను ఎక్కించుకొని ఆటో ఆదివారం ఎల్లారెడ్డికి బయలుదేరింది. ఆటో డ్రైవర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువు కట్టపై ఇద్దరు ప్రయాణికులను ఎక్కించుకున్నాడు. అనంతరం బయలుదేరిన ఆటోను మెదక్ నుంచి ఎల్లారెడ్డికి వస్తున్న లారీ వెనక నుంచి వచ్చి వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే బాధితులను 108లో ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

బైక్‌ను ఢీకొన్న కారు..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని కల్యాణి ప్రాజెక్టు వద్ద ఓ బైక్‌ను కారు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. ఆదివారం బాన్సువాడ నుంచి ఎల్లారెడ్డికి బైక్‌పై వస్తున్న హమీద్‌ను కల్యాణి ప్రాజెక్టు వద్ద వెనక నుంచి గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హమీద్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అతడిని 108లో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కామారెడ్డికి రిఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

రామారెడ్డి మండలంలో..

రామారెడ్డి(ఎల్లారెడ్డి): ఆగి ఉన్న బైకును మరో బైకు ఢీకొట్టడంతో బైకుపై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు ఇలా.. మద్దికుంట గ్రామానికి చెందిన ముదాం సురేష్ ఆదివారం స్కూటీపై తన కొడుకును ఆర్మూర్ హాస్టల్‌లో వదిలేశాడు. అనంతరం సొంతూరు బయలుదేరాగా.. ఉప్పల్‌వాయి గ్రామం వద్ద కొద్దిసేపు ఆగాడు. ఇదే గ్రామానికి చెందిన నితిన్, సంకి మహేష్ బైక్‌తో వేగంగా వెనుక నుంచి వచ్చి స్కూటీని ఢీకొట్టాడు. దీంతో సురేష్ గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, విచారించారు. నితిన్, మహేష్‌లు మద్యం మత్తులో ఉండటమే ప్రమాదానికి కారణమని ఎస్సై అనిల్ పేర్కొన్నారు.

లింగంపేటలో బైక్ చోరీ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలోని బస్టాండ్‌లో ఓ బైక్ చోరీకి గురైనట్లు ఎస్సై శంకర్ ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని కేశాయిపేట గ్రామానికి చెందిన చీటూరి నారాయణ ఉపాధి నిమిత్తం ప్రతిరోజు కామారెడ్డి వెళ్లివస్తుంటాడు. కేశాయిపేట నుంచి ప్రతిరోజు బైక్‌పై లింగంపేటకు వచ్చి, బస్టాండ్‌లోని పెట్రోల్ బంకులో స్లైండర్ ఏపీ 9ఏహెచ్ 7262 నంబరు గల బైక్ పెట్టి బస్సుపై కామారెడ్డికి వెళ్లివస్తుంటాడు. ఈ నెల 9న లింగంపేట బస్టాండులో బైకు పెట్టి కామారెడ్డికి వెళ్లాడు. సాయంత్రం వచ్చే సరికి బైకు కనిపించకపోవడంతో చుట్టు పక్కల గ్రామాల్లో గాలించాడు. ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మోకాళ్ల నొప్పులు భరించలేక ఒకరి ఆత్మహత్య

బాన్సువాడ టౌన్: పట్టణంలో ఓ వ్యక్తి కీళ్లు, మోకాళ్ల నొప్పులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. పాత బాన్సువాడకు చెందిన తోంట(సాకలి)కాశీరాం (58) గత కొన్నేళ్లుగా కీళ్లు, మోకాళ్ల నొప్పితో బాధపడుతున్నాడు. ఈ నెల 10న మోకాళ్ల నొప్పులు భరించలేక అతడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. స్థానికుల సమాచారం మేరకు ఆదివారం శ్మశాన వాటికలోని రేకుల షెడ్డులో చూడగా కాశీరాం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసిందని అన్నారు. మృతుడి భార్య తోంట రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఆయన వివరించారు. మృతుడికి కుమారుడు ఉన్నారు.